## క్లుప్తంగా

### శ్రీరామ నవమికి ఏర్పాట్లు



పందిరి రాట కార్యక్రమంలో పాల్గొన్న గ్రామ పెద్దలు

పరవాడ: పరవాడ గ్రామంలో ఈ నెల 17న నిర్వహించనున్న శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా సర్పంచ్ సిరపరపు అప్పలనాయుడు ఆధ్వర్యంలో రామాలయం వద్ద శ్రీరాముల వారి పందిరిరాట వేసే కార్యక్రమాన్ని శనివారం గ్రామ పెద్దలు, మహిళలు నిర్వహించారు. సీతారాముల కల్యాణాన్ని అత్యంత వైభవంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేశామని సర్పంచ్ అప్పలనాయుడు చెప్పారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్క రామునాయుడు, ఉప సర్పంచ్ బండారు రామారావు, పెద్ద చెరువు ఆయకట్టు రైతు సంఘ అధ్యక్షుడు రెడ్డి శ్రీనివాసరావు, నాయకులు పోతల అప్పలనాయుడు, వర్రి లక్ష్మి, పైల హరీష్, పైల పోతినాయుడు, టీవీ అప్పారావు, చీపురుపల్లి సన్యాసిరావు, చుక్క చిన్నోడు, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

### విస్తం క్యాంపస్ ఇంటర్వ్యూలో 73 మంది ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో విస్తం ప్రతినిధులు

పెందుర్తి : పెందుర్తి మండలం పినగాడి సమీపంలోని విస్తం ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూలో 73 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. డెక్రైన్ కంపెనీలో 73 మంది డిప్లమా విద్యార్థులకు కొలువులు లభించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ బి.వి.శివకుమార్ తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో కళాశాల ప్లేస్‌మెంట్ అధికారులు ఇ.కిరణ్‌కుమార్, అరుణ్, డెక్రైన్ కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

### సాంస్కృతిక పోటీలకు ఆహ్వానం



పోటీల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రాజశేఖర్

సీతంపేట: మిరాకిల్ మ్యూజికల్ క్లబ్ వ్యవస్థాపకుడు మహమ్మద్ షకీల్ సారథ్యంలో ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఈ నెల 27, 28 తేదీల్లో ఉదయం 9 నుంచి రాత్రి 7.30 గంటల వరకు సాంస్కృతిక పోటీలు నిర్వహించనున్నారు. శనివారం పౌర గ్రంథాలయంలో పోటీల పోస్టర్‌ను ఆధ్యాత్మిక వేత్త ఎం.వి.రాజశేఖర్ ఆవిష్కరించారు. ఈ నెల 29న అంతర్జాతీయ నృత్యప్రదర్శన దినోత్సవాన్ని పురస్కరించుకుని శాస్త్రీయ, జానపద నృత్యం, సినీ గీతాలాపన, సంగీత పరికరాల వాద్యం, డ్రాయింగ్, పెయింటింగ్, చిన్నపిల్లలకు విచిత్ర వేష ధారణ, పెద్దలకు వస్త్రాలంకరణ వంటి పలు అంశాలపై పోటీలు నిర్వహిస్తున్నట్లు మహమ్మద్ షకీల్ తెలిపారు. పాల్గొన దలచిన వారు ఈ నెల 25లోగా వాట్సాప్ నంబర్ 99664 85335లో తమ పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. పోటీల విజేతలకు బహుమతులు, జ్ఞాపికలు ప్రసంశాపత్రాలు అందజేస్తామన్నారు.

### మహోదాత్త మహిళ సీతాదేవి



ప్రవచిస్తున్న ఆచార్య మలయవాసిని

సీతంపేట: లలితానగర్ శ్రీలలితా పీఠంలో జరుగుతున్న సీతారామ కల్యాణ వసంత నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా ప్రతి రోజూ సాయంత్రం రామాయణ ప్రవచనాలు జరుగుతున్నాయి. శనివారం సాయంత్రం పీఠం దర్బారు హాల్‌లో విశాఖ సాహితి అధ్యక్షులు ఆచార్య కోలవెన్ను మలయవాసిని రామాయణంలోని సీతాదేవి పాత్రపై ప్రవచనం చేశారు. సీతాదేవి మహోదాత్త మహిళని, రావణ సంహారం కోసమే ఆమె జననం జరిగిందని, సీతారాముల దాంపత్యం లోకానికి ఆదర్శప్రాయమన్నారు. వాల్మీకి చిత్రించిన సీతాదేవి పాత్రలోని భిన్న కోణాలను ఆవిష్కరించారు. విశ్వనాథ సత్యనారాయణ రచించిన రామాయణ కల్పవృక్షంలోని పద్యాలను ఉదహరిస్తూ ప్రసంగం ఆద్యంతం ఆకట్టుకునేలా సాగింది. కార్యక్రమంలో డాక్టర్ డి.వి.సూర్యారావు, కందాల కనకమహాలక్ష్మి, రాంభట్ల నృసింహశర్మ, పలువురు సాహితీవేత్తలు పాల్గొన్నారు.





సమావేశానికి హాజరైన పార్టీ శ్రేణులు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ రీజినల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి. చిత్రంలో పెందుర్తి ఎమ్మెల్యే అభ్యర్థి అన్నంరెడ్డి అదీప్‌రాజ్, అనకాపల్లి ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు

# ప్రజలను మభ్య పెట్టడానికే కూటమి

- జగన్‌మోహన్‌రెడ్డితోనే అన్ని వర్గాల సంక్షేమం
- వైఎస్సార్‌సీపీ రీజనల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి

సబ్బవరం: నాణ్యమైన విద్య,వైద్యం అందించిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కుతుందని వైఎస్సార్‌సీపీ రీజినల్ కో ఆర్డినేటర్, రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి అన్నారు. సబ్బవరంలోని జీఎస్ కన్వెన్షన్ హాల్‌లో శనివారం నిర్వహించిన వైఎస్సార్‌సీపీ పెందుర్తి నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశంలో సుబ్బారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థి అదీప్‌రాజ్, ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడును అధిక మెజారిటీతో గెలిపించడానికి ఐక్యంగా పని చేయాలని పిలుపునిచ్చారు. సచివాలయాలు,రైతు భరోసా కేంద్రాలు,డిజిటల్ లైబ్రరీలు,ఆరోగ్య కేంద్రాలు, నాడు– నేడు ద్వారా పాఠశాలల ఆధునికీకరణ,పేదలందరికీ ఉచిత ఇళ్ల వంటివన్నీ ప్రభుత్వం చేసిన అభివృద్ధిలో భాగమేనన్నారు. ప్రతి జిల్లాలో ప్రభుత్వం సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మించి ప్రజారోగ్యానికి పెద్దపీట వేస్తుందని చెప్పారు.

**వాళ్లవి మోసపూరిత మాటలు**

మోసపూరిత హామీలతో ప్రజలను మభ్య పెట్టేందుకే మూడు పార్టీలు కలిసి కూటమిగా వచ్చాయని సుబ్బారెడ్డి ధ్వజమెత్తారు. వాళ్ల అధికారంలో ఉన్నప్పుడు ఏం చేశారో చెప్పుకోలేని స్థితి ఉండడంతో ప్రజలను మచ్చిక చేసుకోవడానికి అబద్ధాలు, అసత్యాలు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. నిరుద్యోగ యువతీ యువకులకు సీఎం జగన్ అండగా నిలిచారని చెప్పారు. అధికారం చేపట్టిన తర్వాత 2,45,000 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించిందన్నారు. టీడీపీ ప్రభుత్వం 55 వేల ఉద్యోగ అవకాశాలు మాత్రమే కల్పించిందన్నారు.

**మీతో ఉన్న వారిని ఆదరించండి**

నిత్యం తమతో ఉండే స్థానికులైన ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను గెలిపించేందుకు సమష్టిగా పనిచేయాలని సుబ్బారెడ్డి పిలుపునిచ్చారు. త్వరలో నిర్వహించనున్న సిద్ధం బస్సు యాత్రను పెద్ద ఎత్తున విజయవంతం చేయాలని కోరారు. బస్సు యాత్రకు సంబంధించిన రూట్ మ్యాప్‌ను సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు.

**వలస పక్షులు ఇంటికే ..**

ఎక్కడ నుంచో వచ్చిన కూటమి వలస పక్షులను ఇక్కడి ప్రజలు తిరిగి ఇంటికి పంపించడానికి సిద్ధమయ్యారని డిప్యూటీ సీఎం, వైఎస్సార్‌సీపీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు అన్నారు. సీఎం రమేష్,పంచకర్ల రమేష్‌బాబుకు రాజకీయ లక్షణాలు లేవని ఎద్దేవా చేశారు.స్థానికేతరులైన వీరికి నియోజకవర్గ, జిల్లా ప్రజలు తగి బుద్ధి చెబుతారన్నారు. ఎమ్మెల్యే అదీప్‌రాజ్ మాట్లాడుతూ పెందుర్తి నియోజకవర్గ అభివృద్ధి నాడు దివంగత నేత రాజశేఖరరెడ్డి హయాంలో, నేడు ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి నాయకత్వంలోనే జరిగిందన్నారు.కరోనా కష్టకాలంలో ప్రజలకు ప్రభుత్వం సంక్షేమాన్ని అందించిందన్నారు.

**టీడీపీని ప్రజలు క్షమించరు**

పేదల పక్షాన నిలిచిన జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలంతా అండగా నిలవాలని గాజువాక ఎమ్మెల్యే నాగిరెడ్డి పిలుపునిచ్చారు.పేదలకు ఇళ్లు ఇస్తామంటే అడ్డుకున్న టీడీపీని ప్రజలు క్షమించరని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాదరావు, నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు తిప్పల గురుమూర్తిరెడ్డి,ఎంపీపీ బోకం సూర్యకుమారి, కార్పొరేటర్ ముమ్మన దేముడు, పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బయలపూడి భగవాన్ జయరాం, సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు, జెడ్పీటీసీ పైల సన్యాసిరాజు, పార్టీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు పాలిశెట్టి సురేష్ రాజ్, పార్టీ సీనియర్ నాయకులు గండి రవి కుమార్,బోకం రామునాయుడు, కొటాన రాము,కర్రి బాబు,సబ్బవరపు ముత్యాలనాయుడు,సబ్బవరపు నారాయణమూర్తి, కాపుశెట్టి శేషుబాబుతో పాటు మూడు మండలాల జేసీఎస్ కన్వీనర్లు,సర్పంచ్‌లు,పార్టీ ముఖ్య నాయుకులు పాల్గొన్నారు.

### లలితాంబిక అమ్మవారికి ప్రత్యేక పూజలు



స్వయంవర కల్యాణిగా దర్శనమిస్తున్న లలితాంబిక అమ్మవారు

సబ్బవరం: ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం దేవీపురంలోని సహస్రాక్షి రాజరాజేశ్వరీదేవి ఆరాధన పీఠంలో 5వ రోజు లలితాంబిక నవరాత్రి ఉత్సవాలు శనివారం ఘనంగా నిర్వహించారు.ఈ రోజు లలితాంబిక అమ్మవారు స్వయంవర కల్యాణి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ప్రధానంగా వివాహం ఆలస్యం అయిన వారికి ఈ నాటి అమ్మవారి దర్శనం అనుగ్రహం కలిగిస్తుందని గురుమాత అన్నపూర్ణమ్మ తెలిపారు. కార్యక్రమంలో భాగంగా ఆహుతులైన భక్తులకు గురుమాత చేతులమీదుగా అన్నప్రసాదాలు అందజేశారు.

### నేడు అయ్యప్ప సన్నిధిలో విషు పూజ

పెందుర్తి: కేరళలో ఉగాదిని పురస్కరించుకుని సుజాతనగర్‌లోని అయ్యప్పస్వామి దేవాలయంలో ఆదివారం విషు పూజ నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త వాకా చంద్రశేఖర్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం నుంచి స్వామివారికి అభిషేకాలు ప్రత్యేక పూజలు జరుగుతాయని చెప్పారు. అనంతరం ప్రసాద వితరణ జరుగుతందన్నారు. భక్తులంతా తరలిరావాలని కోరారు.

# అభివృద్ధి చేశాం.. ఆదరించండి

- ఎమ్మెల్యే అదీప్‌రాజ్
- ఉత్సాహంగా సాగిన ఎన్నికల ప్రచారం



ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి అదీప్‌రాజ్



ఎమ్మెల్యే అభ్యర్థి అదీప్‌రాజ్‌ను గజమాలతో సత్కరిస్తున్న దృశ్యం



ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న జన సందోహం

పరవాడ: నియోజకవర్గంలో గత ఐదేళ్లలో జరిగిన అభివృద్ధి, అందించిన సంక్షేమ పథకాలను చూసి ప్రజలంతా ఫ్యాను గుర్తుకు ఓటేసి మరోసారి వైఎస్సార్‌సీపీని అధికారంలోకి తీసుకురావాలని ఎమ్మెల్యే, పెందుర్తి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అన్నంరెడ్డి అదీప్‌రాజ్ కోరారు. ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా శనివారం వాడచీపురుపల్లి గ్రామానికి విచ్చేసిన అదీప్‌రాజ్‌కు వైస్ ఎంపీపీ బూస అప్పలరాజు, పీఏసీఎస్ చైర్మన్ బురద రాజు, ఎంపీటీసీ గెద్దం పుష్పాచందర్రావు, సచివాలయ కన్వీనర్ కూండ్రపు తాతాజీ, పార్టీ కార్యదర్శి గాలి చరణ్‌రాజ్ ఆధ్వర్యంలో ప్రజలు హారతులిచ్చి పూల వర్షం కురిపించి గజమాలతో ఘనస్వాగతం పలికారు. ఊటగెడ్డ, ఇస్సన్నపేట, ఊటగెడ్డపాలెం,దళాయిపాలెం, పోలిరెడ్డిపాలెం, గొరుసువానిపాలెం, పందివానిపాలెం, వెంకటాపురం గ్రామాల్లో విస్తృతంగా పర్యటించి వృద్ధులు, దివ్యాంగులు, మహిళలను ఆప్యాయంగా పలకరించారు. జగనన్నను మళ్లీ అధికారంలోకి తీసుకువస్తే అవ్వాతాతల కష్టాలు తీరుతాయని వారికి భరోసా కల్పించారు. అనంతరం సంతబయలులో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో అదీప్‌రాజ్ మాట్లాడుతూ ఇచ్చిన మాట నిలబెట్టుకున్న జగనన్నను మరో సారి ముఖ్యమంత్రిని చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. గతంలో చంద్రబాబు ప్రభుత్వం చేసిన మోసాలను ప్రజలకు గుర్తు చేశారు.టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు చెప్పే కల్లబొల్లి మాటలను నమ్మి మోసపోవద్దన్నారు. నిత్యం అందుబాటులో ఉంటూ పిలిస్తే పలికే వైఎస్సార్‌సీపీ తరపున ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్న తనతో పాటు ఎంపీగా పోటీ చేస్తున్న బూడి ముత్యాలనాయుడును గెలిపించాలని ప్రజలను కోరారు. అభివృద్ధి, సంక్షేమ పథకాల ద్వారా వాడచీపురుపల్లి పంచాయతీలో రూ.32 కోట్ల మేర నిధులు ప్రభుత్వం మంజూరు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. 2009లో రాంపురం మేజర్ పంచాయతీ సర్పంచ్‌గా ఉంటూ కాంగ్రెస్ పార్టీ జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా పనిచేసిన విషయాన్ని అదీప్‌రాజ్ గుర్తు చేశారు. తాను రాజకీయాల్లో చాలా జూనియర్ అని ప్రతిపక్ష పార్టీ అభ్యర్థి అనడం చాలా విడ్డూరంగా ఉందన్నారు. అతను రాజకీయాల్లోకి రాక మునుపే మా సొంత నిధులతో రాంపురం ప్రాంతంలో 72 మంది నిరుపేదలకు పక్కా గృహాలు నిర్మించామని అదీప్‌రాజ్ గుర్తు చేశారు. రోజుకో పార్టీ జెండా మార్చుతూ రాజకీయాలు చేస్తున్న నాన్‌లోకల్ అభ్యర్థి పంచకర్లకు తనను విమర్శించే అర్హత లేదని అదీప్‌రాజ్ అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు, జెడ్పీటీసీ పైల సన్యాసిరాజు, పార్టీ నాయకులు గండి రవికుమార్, మండల జేసీఎస్ కన్వీనర్ వెన్నల సన్యాసిరావు, పార్టీ నాయకులు పల్లా అప్పారావు, బొంది అచ్చిబాబు, పైల అప్పలనాయుడు, కూండ్రపు సీతారామయ్య, అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

# ‘పంచగ్రామాల’ పాపం టీడీపీదే



విజినిగిరిపాలెంలో ప్రచారం నిర్వహిస్తున్న ముత్తంశెట్టి శ్రీనివాసరావు



విజినిగిరిపాలెం వైఎస్సార్‌సీపి నాయకులతో ముత్తంశెట్టి శ్రీనివాసరావు

- చంద్రబాబు హయాంలోనే భూ సమస్య
- పంచగ్రామాల ప్రజలకు మేలు చేసిన సీఎం జగన్
- గంటా పెద్ద భూకబ్జాదారుడు
- టీడీపీకి ఓటు అడిగే అర్హత లేదు
- ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

సింహాచలం : టీడీపీ ప్రభుత్వంలోనే పంచగ్రామాల భూ సమస్య ఏర్పడిందన్న విషయాన్ని ప్రజలు గుర్తుంచుకోవాలని, 1996లో చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే సింహాచలం దేవస్థానానికి చినగదిలి, పెందుర్తి ఎమ్మార్వోలు రైతువారీ పట్టాలు జారీచేశారని మాజీ మంత్రి, భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు తెలిపారు. భీమిలి నియోజకర్గం 98వ వార్డులోని అడవివరం పరిధిలో ఉన్న విజినిగిరిపాలెంలో శనివారం ముత్తంశెట్టి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి మే 13న జరిగే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీలక్ష్మిని, భీమిలి ఎమ్మెల్యేగా పోటీచేస్తున్న తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ముత్తంశెట్టి మాట్లాడుతూ దాదాపు 30 ఏళ్ల నుంచి పంచగ్రామాల భూ సమస్య నెలకుందన్నారు. 13 వేల మంది ప్రత్యక్షంగాను, లక్షమంది పరోక్షంగాను ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. ఇళ్ల మరమ్మతులు కూడా చేసుకోని పరిస్థితిలో ప్రజలు ఉంటే టీడీపీ ప్రభుత్వం ఏనాడూ పట్టించుకోలేదన్నారు. కానీ పంచగ్రామాల్లో ఇళ్ల మరమ్మతులు చేసుకునేందుకు అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిదే అన్నారు. అలాగే పంచగ్రామాల భూసమస్యను శాశ్వతంగా పరిష్కరిచేందుకు వైఎస్సార్‌సీపీ విశేషంగా కృషి చేసిందన్నారు. సుమారు రూ.1900 కోట్ల విలువచేసే ప్రభుత్వ భూమిని సింహాచలం దేవస్థానానికి ఇచ్చేందుకు ప్రభుత్వం పూనుకుందన్నారు. మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రికాగానే సమస్య పూర్తిగా పరిష్కరించనున్నామని తెలిపారు. ప్రతీ వార్డు, గ్రామంలోను సచివాలయం, వలంటర్ వ్యవస్థను ఏర్పాటుచేసి ఇంటి వద్దకే పింఛన్లు, సంక్షేమ ఫలాలు అందేలా చేశారన్నారు. భీమిలి నియోజకర్గంలో 127 సచివాలయాలు ఉన్నాయని, ఆ సచివాలయాల పరిధిలో ఉన్న ప్రతీ ఇంటింటికి తిరిగి సమస్యలు తెలుసుకున్నానన్నారు. చిన్నచిన్న సమస్యలు ఉంటే తక్షణం పరిష్కారం చూపానని పేర్కొన్నారు. మేజర్ సమస్యలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించానని చెప్పారు. ఐదేళ్ల కాలంలో నియోజకవర్గంలోని 14వార్డుల పరిధిలో రూ.2200 కోట్ల సంక్షేమ పథకాలకు, రూ.500కోట్ల అభివృద్ధి పనులకు ఖర్చుపెట్టడం జరిగిందని వివరించారు.

**గంటా ఏనాడైనా పట్టించుకున్నాడా..**

టీడీపీ ప్రభుత్వంలో ఐదేళ్ల భీమిలి ఎమ్మెల్యేగా పని చేసిన గంటా శ్రీనివాసరావు ఏనాడూ నియోజకర్గాన్ని గానీ, ప్రజలను గానీ పట్టించుకున్న పాపాన పోలేదని ముత్తంశెట్టి శ్రీనివాసరావు గుర్తుచేశారు. భీమిలిలో అనేక భూకబ్జాలకు పాల్పడ్డారని గుర్తుచేశారు. చివరికి చంద్రబాబు గంటాకే సీటు ఇవ్వడం విడ్డూరంగా ఉందన్నారు. చంద్రబాబుకిగానీ, టీడీపీ అభ్యర్థులకుగానీ ప్రజలకు ఓటు అడిగే అర్హత లేదన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ 98వ వార్డు అధ్యక్షుడు కొలుసు ఈశ్వరరావు, వార్డు ఇన్‌చార్జి ఎర్ర వరహా నరసింహం, అడవివరం కోఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు కర్రి అప్పలస్వామి, పార్టీ నాయకులు పీతల అప్పలరాజు, కర్రి సత్తిబాబు, లంక సత్తిబాబు, వర్మ, శిడగం తాతబాబు, ఆదిరెడ్డి, తెడ్లపు మహేష్, బోర కృష్ణారెడ్డి, మధురెడ్డి, శ్రీను, తొమురోతు రాము,ఎన్.అప్పారావు, విజినిగిరిపాలెం వైఎస్సార్‌సీపీ నాయకులు మజ్జి ధర్మా, మజ్జి అప్పలరమణ, విజినిగిరి కృష్ణమూర్తి, మొయ్యి రమణ,మజ్జి అప్పన్న, పాలూరి శ్రీనివాసరావు, విజినిగిరి వరహానరసింహం పాల్గొన్నారు.

# అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు



గరుడసేవ నిర్వహిస్తున్న అర్చకులు



నిత్యకల్యాణంలో జీలకర్రబెల్లం ఘట్టాన్ని నిర్వహిస్తున్న అర్చకులు



నిత్యకల్యాణంలో పాల్గొన్న ఉభయదాతలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శనివారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 9.30 గంటల నుంచి నిత్యకల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను కల్యాణమండపంలో వేదికపై అధిష్టం పజేశారు. పుణ్యాహవచనం, సంకల్పం, కంకణ ధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్య ధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణాన్ని నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదాన్ని అర్చకులు అందజేశారు.

**వైభవంగా గరుడసేవ**

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శనివారం గరుడ సేవ వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో వెండి గరుడ వాహనంపై స్వామివారి ఉత్సవ మూర్తి గోవిందరాజస్వామిని అధిష్టంపజేశారు. అష్టోత్తర శతనామావళి పూజ నిర్వహించారు. భక్తులను గరుడవాహనం చుట్టూ ప్రదక్షిణ చేయించారు.

### వెంకన్నకు ప్రత్యేక పూజలు



పెందుర్తి: స్థానిక వెంకటాద్రిపై శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే సుప్రభాత సేవ, ఆరాధన, బాల బోగం చేశారు. అనంతరం తోమాల సేవ జరిపారు. సహస్ర నామార్చన, రాజభోగం, సర్వ దర్శనాలు జరిగాయి. వెంకన్న సన్నిధిలో భక్తులు తులాభారం నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. అధిక సంఖ్యలో వచ్చిన భక్తుల కోసం వెంకటాద్రి దిగువ నుంచి ఉచిత రవాణా సదుపాయం కల్పించారు. భక్తులకు ప్రసాద, మజ్జిగ వితరణ చేపట్టారు.

# కార్మికుల హక్కులు కాపాడాలి



ఎస్‌ఈజెడ్‌లో షెడ్ల వద్ద ఆడుకుంటున్న చిన్నారులతో గనిశెట్టి

పరవాడ: స్థానిక ప్రత్యేక ఆర్థిక మండలి(ఎస్ఈజెడ్) కార్మికుల హక్కులను కాపాడాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఎస్ఈజెడ్‌లో గనిశెట్టి శనివారం పర్యటించి అక్కడ నివాసాలు ఉంటున్న కార్మిక కుటుంబాల పరిస్థితులను పరిశీలించారు. ఎస్ఈజెడ్ పరిసర ప్రాంతాల్లో ఒడిస్సా నుంచి వచ్చిన 150 మంది కార్మికులు తమ కుటుంబాలతో చిన్న తడకలు, గుడారాలతో నిర్మించిన షెడ్లలలో నివాసం ఉంటూ స్థానిక పరిశ్రమల్లో చిన్న చిన్న పనులు చేసుకొంటూ జీవనం సాగిస్తున్నారని చెప్పారు. షెడ్ల వద్ద కనీస సదుపాయాలు లేవన్నారు. మరుగుదొడ్లు కూడా ఏర్పాటు చేయని కారణంగా ఆరుబయటే మలవిసర్జన చేస్తున్నారన్నారు. మహిళలకు కనీస భద్రత లేదన్నారు. రసాయనిక పరిశ్రమలను ఆనుకొని కార్మిక కుటుంబాలకు నివాసాలు కల్పించడం చట్టరీత్యా నేరమన్నారు. కనీస సదుపాయాలు లేని షెడ్ల వద్ద కార్మిక కుటుంబాలు పిల్లా పాపలతో దుర్భర జీవితాలు గడుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణం అధికారులు చర్యలు తీసుకోవాలని గనిశెట్టి డిమాండ్ చేశారు.

### 4400 కిలోల పీడీఎస్ బియ్యం పట్టివేత

పరవాడ: పెదముషిడివాడ గ్రామంలో బొలెరా వాహనంలో అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని పరవాడ పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. వివరాలు.. సీఐ ఎస్.బాల సూర్యారావు తన సిబ్బందితో శనివారం రాత్రి పెదముషిడివాడ గ్రామ సమీపంలో వాహనాలను తనిఖీ చేస్తున్నారు. అటువైపుగా వెళుతున్న బొలెరో వాహనాన్ని తనిఖీ చేయగా అందులో రూ.1.84 లక్షల విలువ చేసే 4400 కిలోల పీడీఎస్ బియ్యం పట్టుబడ్డాయి. పీడీఎస్ బియ్యంతో సంబంధం ఉన్న పూసర్ల అచ్చిబాబు, మురుగుతి రాజులను అదుపులోకి తీసుకొని వాహనాన్ని సీజ్ చేసి కేసు నమోదు చేశామని సీఐ బాలసూర్యారావు చెప్పారు.

### నేటి నుంచి అగ్నిమాపక వారోత్సవాలు



ఫైర్ ఆఫీసర్ సత్యరాజు

సబ్బవరం: అగ్నిమాపక వారోత్సవాలను ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు సబ్బవరం అగ్నిమాపక అధికారి జీవీ సత్యరాజు శనివారం తెలిపారు. రాష్ట్ర విపత్తు స్పందన,అగ్నిమాపక సేవల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్న వారోత్సవాల్లో భాగంగా అగ్ని ప్రమాదాలను అరికట్టడంతో పాటు నివారణ పద్ధతులపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

### ఘనంగా సిక్కుల బైసాఖి వేడుకలు



గురుద్వారా సాధు సంగత్‌లో ప్రార్థనలు చేస్తున్న సిక్కులు

సీతమ్మధార: సిక్కుల ప్రధాన పండగ బైసాఖి(వైశాఖి) వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఇదే రోజున సిక్కు గురువు గురుగోబింద్ సింగ్ ఖల్సా స్థాపించిన సందర్భంగా సిక్కులు నూతన సంవత్సర వేడుకలు జరుపుకున్నారు. గురుద్వారా జంక్షన్‌లోని గురుద్వారా సాధు సంగత్‌లో భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు చేశారు. సాధు సంగత్ అధ్యక్షుడు ఆనంద్ సిక్కు గురువుల బోధనలను ఉపదేశించారు. సిక్కులు సంప్రదాయ దుస్తుల్లో గురుద్వారాను దర్శించుకుని ఉదయం నుంచి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు, సిక్కు కుటుంబాల సభ్యులు పాల్గొన్నారు.

### ఉరేసుకుని వృద్ధుడి ఆత్మహత్య

మద్రిపాలెం: నిర్మాణం జరుగుతున్న ఇంటి శ్లాబ్ పరంజాకు ఉరివేసుకుని ఓ వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. తెన్నేటినగర్‌లోని చిన్న కుమార్తె ఇంటికి వెళ్లిన బుదిరెడ్డి సత్యం(63) ఈ నెల 12వ తేదీ శుక్రవారం రాత్రి 11.30 గంటల సమయంలో మేడ మీద శ్లాబ్ పరంజాకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడు కాగితాలు ఏరుకుంటూ జీవిస్తూ అదే ప్రాంతంలో నివసిస్తున్నాడు. ఇతడికి మద్యం తాగే అలవాటు ఉంది. పెద్ద కుమార్తె డి.వెంకటలక్ష్మి శనివారం ఐదో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ ఎస్.భాస్కరరావు నేతృత్వంలో కేసు దర్యాప్తు చేపట్టారు.